
ఖాకీల్లో.. కలకలం

ఉమ్మడి జిల్లాలో త్వరలోనే మరికొందరు అధికారులపై చర్యలు!



ఈనాడు, నల్గొండ :

ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో వైఫల్యం చెందడంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పనిచేస్తున్న 15 మంది ఎస్సైలపై ఉన్నతాధికారులు వేటు వేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతోంది. మల్టీజోన్-2లో వేటు పడ్డ వారిలో ఉమ్మడి జిల్లా ఎస్సైలే అత్యధికంగా ఉండటం గమనార్హం. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక పాలసీపై విధాన నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రభుత్వ రీచుల నుంచి గత కొంత కాలంగా ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా కొంత మంది అక్రమార్కులు ఉమ్మడి జిల్లాలోని మూసీ, కృష్ణా నది పరివాహక ప్రాంతాలు, వాగులు, వంకల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అండతో యథేచ్ఛగా ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు.

■ గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరు, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మోత్కూరు, మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి, అడవిదేవులపల్లి, వాడపల్లి, నల్గొండ నియోజకవర్గంలోని కనగల్, తిప్పర్తి, నాగార్జునసాగర్‌లో హాలియా, సూర్యాపేటలో ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్, మునుగోడులో చండూరు, ఆలేరులో గుండాల మండలాల్లోని వాగులు, రీచుల నుంచి ఇసుక సరఫరాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా.. కొంత మంది అక్రమార్కులు దానిని హైదరాబాద్‌కు తరలించేవారు. తుంగతుర్తిలోని వంగమర్తి రీచుతో పాటు జాజిరెడ్డిగూడెం నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రానికి ఇసుక సరఫరా పేరుతో వేల లారీలను హైదరాబాద్‌కు తరలించారు. ప్రభుత్వ పేరుతోనూ అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగింది. కొత్త ప్రభుత్వంలోనూ ఇదే విధమైన ఎత్తుగడలు వేద్దామని అక్రమార్కులు రూపొందించినా ప్రభుత్వ విధానం, మూసీలో ఉధృత ప్రవాహం ఉండటంతో అక్రమార్కుల ఎత్తుగడలు సాగడం లేదు. దీంతో కొన్ని రీచుల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గుట్టపైకి తీసుకొచ్చి వాటిని లారీల్లో డంపు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

ఎప్పటికప్పుడు నిఘా వర్గాల ఆరా..

■ ఇసుక ఆదాయం ఉన్న పోలీసు స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం బాగా డిమాండ్ ఉంది. కొంత మంది రాజకీయ నాయకులు జిల్లా పోలీసు అధికారులపై ఒత్తిళ్లు తీసుకువచ్చి పలానా పోస్టింగ్‌లు ఇవ్వాలని సూచిస్తున్నారు.

■ ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఇసుక ఆదాయం ఉన్న మూడు పోలీసు స్టేషన్లకు పోస్టింగ్‌ల కోసం సదరు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఆశ్రయించగా ఏకంగా ఒక్కో పోలీసు స్టేషన్‌కు నాలుగు నుంచి ఐదుగురికి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి ఏదో ఒక పేరుతో మాత్రమే సిఫార్సు లేఖ ఇస్తేనే పోస్టింగ్ ఇస్తామని స్పష్టం చేసినట్లు సమాచారం. మరికొంత మంది ప్రజాప్రతినిధులు పోస్టింగ్‌ల కోసం వచ్చే అధికారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు గతంలో లాగా కాకుండా జిల్లా ఎస్బీ విభాగంతో పాటు రాష్ట్ర నిఘా విభాగం ఇసుక ఆదాయం ఉండే ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులపై ఎప్పటికప్పుడు నిఘా వేసి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఇటీవల వేటు పడ్డ అధికారులపై గత ఆరు నెలల నుంచి పక్కాగా సమాచారం సేకరించి జిల్లా ఉన్నతాధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

అక్రమ రవాణా అరికట్టనందుకే..

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో అక్రమార్కులకు అండగా ఉంటున్నారనే నివేదికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి డివిజన్‌లో పనిచేస్తున్న మరికొంత మంది పోలీసు అధికారులపై త్వరలోనే చర్యలు ఉండనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా రాచకొండ పరిధిలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు ఇప్పటికే నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటికే నివేదికలు ప్రభుత్వానికి చేరాయని.. ఒకటిరెండు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి 'ఈనాడు'కు వెల్లడించారు.

శ్రమ ఆయుధమై..
ఐదు ఉద్యోగాలు చేరువై..!

ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ రోజుల్లో ఒక ఏడాదిలో ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించి సత్తా చాటింది మందడి వాణి. భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన మందడి నర్సిరెడ్డి, నవనీత దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన వాణి ప్రాథమిక విద్య నుంచి పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ ప్రైవేటు కళాశాలలో చదివారు.



భర్త శేఖర్‌రెడ్డితో వాణి

★ 2007లో గుండాల మండలంలోని అంబాల గ్రామానికి చెందిన భీమిడి శేఖర్‌రెడ్డితో వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో బీఈడీ, పీజీ పూర్తి చేశారు. కొద్ది సంవత్సరాలు ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహించారు. తన ఇద్దరు పిల్లలను చదివిస్తూనే పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడాది గురుకుల పాఠశాలల ఉద్యోగాల్లో తెలుగు విభాగంలో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించారు. కీసరలోని మహాత్మాజ్యోతిరావు పులే గురుకుల కళాశాలలో జేఎల్‌గా చేరారు. ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షలోనూ తెలుగు స్కూల్ అసిస్టెంట్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రథమ ర్యాంకుతో పాటు, తెలుగు పండిట్ గ్రేడ్-2లో సైతం జిల్లా ప్రథమ ర్యాంకు సొంతం చేసుకున్నారు. ★ భర్త ప్రోత్సాహంతోనే ఫలితాలు సాధించానని ఆమె తెలిపారు.

- న్యూస్‌టుడే, గుండాల



గంధమల్ల చెరువు

గంధమల్ల జలాశయానికి మోక్షం

స్వరూపం ఇదీ..

- మండలం: తుర్కపల్లి
- సామర్థ్యం: 1.41 టీఎంసీలు
- కట్ట పొడవు: 2.95 కి.మీ.
- అంచనా వ్యయం: రూ. 575.57 కోట్లు
- ఆయకట్టు: 56,833 ఎకరాలు

భువనగిరి, న్యూస్‌టుడే:

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన తుర్కపల్లి మండలం గంధమల్ల జలాశయం నిర్మాణానికి సంబంధించి దస్త్రం చకాచకా కదులుతోంది. ఆగస్టు 30న భువనగిరిలో జరిగిన పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశంలో గంధమల్ల రిజర్వాయర్‌ను మంజూరు చేస్తున్నట్లు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆ తదుపరి కాగితాల పనులు వేగం పుంజుకున్నాయి. 1.41 టీఎంసీల సామర్థ్యంతో ఈ జలాశయ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి ఆదేశాల మేరకు కొత్త ప్రతిపాదనలు సెప్టెంబరు 5న ప్రభుత్వానికి నివేదించారు. ముంపు గ్రామాలు లేకుండా జాగ్రత్త పడ్డారు.

★ 9.86, 4.28, 1.41 టీఎంసీల సామర్థ్యాలతో మూడు ప్రతిపాదనలను రూపొందించగా.. ముంపు గ్రామాలు లేకుండా 1.41 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 56,833 ఎకరాలకు సాగు నీరు అందనుంది.

★ ఆలేరు నియోజకవర్గంలోని కరవు పీడిత ప్రాంతాలకు ఈ జలాశయం కల్పతరువుగా మారనుంది. రూ.575.57 కోట్ల అంచనా వ్యయంతో నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

★ ఆర్థిక శాఖకు ఆమోదం తెలిపింది. సీఎం ఆమోదం కోసం నీటిపారుదల శాఖ అధికారులు దస్త్రాన్ని పంపాల్సి ఉంది. నీటి పారుదల శాఖ మంత్రి, ఆర్థిక శాఖ ఇద్దరూ గతంలోనే ఆమోదించడంతో సీఎం సంతకం చేయడం లాంచనమే.

★ సీఎం రేవంత్‌రెడ్డి కూడా పచ్చజెండా ఊపిన వెంటనే జీవో విడుదలై సాంకేతిక ఆమోదం, టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇవన్నీ పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని నీటి పారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అటవీ శాఖకు చెందిన 44 ఎకరాలను సేకరించాల్సి ఉండగా వారి ఆమోదం కూడా తీసుకున్నామన్నారు. ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేవని సీఎం ఆమోదం లభిస్తే పనులు ఇంకా వేగంగా జరుగుతాయన్నారు.

ఆయకుట్ట పరిధిలోకి వచ్చే మండలాలు, గ్రామాలు

నియోజకవర్గం	జిల్లా	మండలం	ఆయకట్టు (ఎకరాలు)
ఆలేరు	యాదాద్రి	తుర్కపల్లి.ఎం	645
,,	,,	రాజపేట	27,696
,,	,,	ఆలేరు	10,596
,,	,,	యాదగిరిగుట్ట	13,707
జనగాం	జనగాం	బచ్చన్నపేట	4,279

త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి

- బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే



భారీ నీటిపారుదల శాఖ మంత్రి భువనగిరి సమావేశంలో గంధమల్ల జలాశయం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్థిక శాఖ అనుమతి లభించింది. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారు. ఆయన అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభమయ్యేలా అధికారులపై ఒత్తిడి తెస్తాను. అతిత్వరలో పనులు పూర్తిచేయించి నియోజకవర్గంలోని 52,554 ఎకరాలకు సాగు నీరు అందించి నాలుగు మండలాలను సస్యశ్యామలం చేస్తాం.

నేడు యాదాద్రిలో
స్వాతి నక్షత్రోత్సవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం స్వాతి నక్షత్రం వేడుకలు నిర్వహిస్తారు. నరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా శనివారం ఉదయం గర్భాలయంలోని మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం చేపడతారు. ఈ వేడుకలో భాగంగా వేకువ జామునే భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తారు.

వైభవంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్య క్షేత్రంలో నిత్యారాధనలతో పాటు అమ్మవారి సంప్రదాయ ఆరాధనలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. శుక్రవారం సూర్యోదయానికి ముందస్తే గర్భాలయంలో కొలువుదీరిన పంచనారసింహులను మేల్కొలిపే క్రతువును సుప్రభాతం ద్వారా చేపట్టిన పూజారులు స్వయంభువులను హారతి నివేదనతో కొలిచారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి స్వర్ణమూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను ఆరాధిస్తూ స్వర్ణ పుష్పాలతో నిత్యార్జిత అర్చనా పర్వాన్ని కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీ సుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనారసింహుల నిత్యకల్యాణాన్ని శాస్త్రానుసారంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీదేవిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్ది ఊంజల్ సేవా పర్వాన్ని చేపట్టారు. అద్దాల మండపంలోకి చేర్చి ఊంజల్ సేవా కైంకర్యాన్ని వేదమంత్ర పఠనాల మధ్య నిర్వహించారు. శ్రీస్వామి, అమ్మవార్ల అలంకార సేవోత్సవం నిర్వహించారు. రాత్రి స్వయంభువులను ఆరాధిస్తూ ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన జరిపారు.



అద్దాల మండపంలో నిర్వహించిన అమ్మవారి ఊంజల్ సేవ

న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులకు వైద్య పరీక్షలు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఉద్యోగ, వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఒత్తిడి, జీవనశైలి కారణంగా ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్, ఎయిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి బార్ అసోసియేషన్ ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులకు రక్తపోటు, మధుమేహం, కంటి, క్యాన్సర్ పరీక్షలు వైద్యుల బృందం నిర్వహించింది. 134 మంది వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత, జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఎయిమ్స్ స్టాండింగ్ కౌన్సిల్ వేముల అశోక్, ఎయిమ్స్ వైద్యులు వాహిణి, చంద్రమౌళి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజుకు రక్తపోటు పరీక్ష చేస్తున్న ఎయిమ్స్ వైద్యులు

సదరం స్లాట్ బుకింగ్ 7న

భువనగిరి, న్యూస్‌టుడే: అక్టోబరు నెలలో జరిగే సదరం శిబిరాలకు ఈ నెల 7న స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి శుక్రవారం విడుదల ప్రకటనలో పేర్కొన్నారు. పాత వారు రెన్యూవల్స్, కొత్త వారు మీ సేవ కేంద్రాల్లో బుక్ చేసుకోవాలని తెలిపారు. బుకింగ్ అనంతరం కేటగిరీల వారీగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 8న వినికిడి లోపం ఉన్న కొత్త వారు 50 మంది, రెన్యూవల్స్ కోసం 20 మందికి, 9, 16, 19, 23 తేదీల్లో శారీర లోపం (ఆర్థోపెడిక్) పరీక్షలకు 50 మంది కొత్తవారు, 20 పాతవారికి స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 18న మానసిక రుగ్మతలతో బాధ పడుతున్న పాతవారు 40 మందికి, కొత్త వారికి 10 స్లాట్లు ఉంటాయన్నారు. 29న కంటిచూపు సమస్యతో బాధపడుతున్న పాతవారు 30 మంది, కొత్తగా 10 మందికి పరీక్షలు నిర్వహించేందుకు స్లాట్లు విడుదల చేసినట్లు టి.నాగిరెడ్డి తెలిపారు.

ఉపాధి ప్రణాళికలు షురూ..!

నెలాఖరు వరకు గ్రామసభల నిర్వహణ ప్రక్రియ



జాల గ్రామంలో ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామసభకు హాజరైన అధికారులు, స్థానికులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు కొన్నేళ్లుగా చేతినిండా పని కల్పిస్తుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రతిఏటా నూతన పనుల గుర్తింపు ప్రక్రియ చేపట్టి పరిపాలన ఆమోదానికి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. ముఖ్యంగా వలసల నివారణకు ఉన్న గ్రామాల్లోనే పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిరుపేదలకు బాసటగా నిలుస్తుంది.

ఉమ్మడి జిల్లా సమాచారం..

జాబ్ కార్డులు	జిల్లా	ఉపాధి కూలీలు
3,53,029	నల్గొండ	7,60,181
2,61,126	సూర్యాపేట	5,77,294
1,38,806	యాదాద్రి	2,57,919

ఆమోదం రాగానే...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లోని 1740 గ్రామ పంచాయతీలలో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబరులో మండలాల వారీగా ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. పరిపాలన ఆమోదం వెంటనే గ్రామాల్లో సదరు పనులను ఉపాధికూలీల ద్వారా చేపట్టనున్నారు.

భూగర్భ జలాల పెంపు పనులకు ప్రాధాన్యం..

పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడా మైదానాలు వంటి పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, వ్యవసాయ బావులకు రహదారి నిర్మాణాలు, కట్టుకాల్వల పనులను చేపట్టారు.

★ ఈ సారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు అంటున్నారు. పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకు పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో ఇప్పటి నుంచే ప్రక్రియ చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి పంపించాల్సి ఉంటుంది. ఆ వెంటనే తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.


★ 2025-26 సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల తీరుపై ప్రణాళికల రూపకల్పనకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతితో పనులు గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయమై గాంధీ జయంతి రోజు నుంచి ఈ గ్రామసభల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరు వరకు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈసారి భూగర్భ జల వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

రైతులకు అండగా ఉంటాం

భాజపా శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటుండగా రాష్ట్రంలో గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు మాయమాటలతో రైతులు, ప్రజలను మోసం చేస్తున్నాయని భాజపా శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ ఎదుట ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీర్క సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రైతుల ధర్నా, భాజపా దీక్షా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పీఏసీఎస్‌లో 2,989 మందికి గాను రూ.43 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 949 మందికి రూ.7.5 కోట్లు మాత్రమే రుణమాఫీ డబ్బులు బ్యాంకులో జమయ్యాయని ఇంకా రైతులకు అందలేదన్నారు. పీఏసీఎస్‌లో అవినీతి బాగోతంతో ఛైర్మన్ రెండు సార్లు సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపిస్తూ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

★ ఇటీవల భాజపా ఆధ్వర్యంలో ధర్నా చేసి పాలకవర్గాన్ని నిర్బంధించగా ఎస్‌బీఐ అధికారులు, తహసీల్దార్ వచ్చి సెప్టెంబరు 30వ తేదీ వరకు జమచేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంకా జమచేయకపోవడం విడ్డూరమన్నారు. వారం రోజుల్లో రైతులందరికీ మాఫీ కాకపోతే వారికి అండగా నిలిచి పోరాడుతామని చెప్పారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరి ఖాతాలో డబ్బులు జమచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పి ఇప్పటి వరకు జమచేయకపోవడం వల్లనే రైతులకు అండగా ఒక్కరోజు దీక్ష చేపట్టామన్నారు. అంతకుముందు గ్రామంలో వివిధ నిర్మాణాలకు, పేదలకు భూదానం చేసిన చందుపట్ల రామ్‌గోపాల్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, కరుణాకర్‌సాయి, దంతూరి భాస్కర్, క్యాసాని శ్రీనివాస్, మట్ట ఆంజనేయులు, సాధినేని ఉపేందర్, బూరుగు మణికంఠ, బబ్బూరి సురేశ్‌గౌడ్, మంగు నర్సింహారావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం భాస్కర్, వేదికపై భాజపా శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, తదితరులు

బతుకమ్మ వచ్చినా.. మూటల్లోనే



నకిరేకల్‌ పుర కార్యాలయంలో ఏడాది నుంచి మూటల్లో మూలుగుతున్న బతుకమ్మ చీరలు

నకిరేకల్‌, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ మళ్లీ వచ్చింది. గతేడాది పండగ కోసం తెచ్చిన బతుకమ్మ చీరల్లో మిగిలినవి పంపిణీకి నోచుకోవడం లేదు. ఏడాది నుంచి కార్యాలయాల్లో మూటల్లోనే మూలుగుతున్నాయి. చీరలు దుమ్ము పట్టి పోతున్నాయి. వాటిపై ముసురులు కప్పేస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో అప్పటి ప్రభుత్వం మహిళలకు పండగ కానుకగా బతుకమ్మ చీరలు పంపిణీ చేసింది. పంపిణీ మొదలు పెట్టిన ఆరు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ అమల్లోకి రావడంతో చీరల పంపిణీ నిలిచిపోయింది. ఆ తర్వాత కొలువు దీరిన కొత్త ప్రభుత్వం చీరల పంపిణీపై నిర్ణయం తీసుకోలేదు. అధికారులు చేయలేకున్నారు. అప్పటి పంపిణీ చేయగా మిగిలిన చీరలు పంచాయతీ, పుర కార్యాలయాల్లోని గదుల్లో ఉన్నాయి. ఇలా మిగిలిన చీరల వివరాలను తొమ్మిది నెలల క్రితం అధికారులు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. పోయిన సంపూర్ణ సమ్మతిలో ఉన్న మహిళలకు చీరల కానుకలను పంపిణీ చేయాలన్న యోచనలో ఈ ప్రభుత్వం ఉంది. బతుకమ్మ పండుగకు మహిళలకు ఏం ఇవ్వాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం ప్రకటించడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో గతేడాది ఎన్నికల కోడ్‌ కారణంగా పంచకుండా మిగిలిన చీరలు లక్షల సంఖ్యలో ఉన్నాయి. 2023 అక్టోబరులో నకిరేకల్‌ మండలం, పురపాలికకు 21,250 బతుకమ్మ చీరలు రాగా కోడ్‌ అమల్లోకి వచ్చేనాటికి 6,657 చీరలను మాత్రమే పంపిణీ చేశారు. 14,593 చీరలు కార్యాలయాల్లోని మూటల్లో నేటికి మూలుగుతున్నాయి.

★ నిల్వ ఉన్న చీరలపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదని నకిరేకల్‌ పుర కమిషనర్‌ డి.బాలయ్య చెప్పారు.



గతేడాది జిల్లాల వారీగా లబ్ధిదారులు, చీరల వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	వచ్చిన చీరలు (లక్షల్లో)
నల్గొండ	5.61	4.00
సూర్యాపేట	3.27	2.96
యాదాద్రి	2.98	2.26



చికెన్ ధరలు


ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

యాదాద్రి శిల్పాలపై అవతారమూర్తులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: హైందవ సంస్కృతికి దర్పణం పట్టే దేవతామూర్తులతో యాదాద్రి క్షేత్రంలో శిల్పసంపద భక్తజనులకు ఆధ్యాత్మిక ఉత్తేజం కలిగిస్తున్నాయి. క్షేత్రాభివృద్ధిలో భాగంగా ఏకశిలతో చెందిన కృష్ణశిలతో రూపొందించిన అష్టభుజి మండప ప్రాకారాలలోని స్తూపాలపై చెక్కి, మహావిష్ణువు దాల్చిన అవతారాలను ఆవిష్కృతం చేశారు. స్తూపాలపై ఉన్న ఈ రూపాలు కనువిందుగొల్పుతున్నాయి. శ్రీలక్ష్మీనారాయణ స్వామి, కూర్మావతారం, రామావతారం, వరహావతారం రూపాలే కాకుండా ఇతర దేవుళ్ల రూపాలను పొందుపరిచారు.



కూర్మావతారం



రామావతారం



వరహావతారం



శ్రీలక్ష్మీనారాయణులు

దసరా సెలవులు.. విజ్ఞాన నెలవులు





నాంపల్లి, న్యూస్‌టుడే: సమయం వెలకట్టలేనిది.. ప్రణాళికతో ముందుకెళ్తే ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. ప్రభుత్వం విద్యార్థులకు ఈ నెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. వీటిని విద్యార్థులు వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు.

చరవాణికి దూరం..



విద్యా సంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్ సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికినా స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో చరవాణికి అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. గంటలకొద్దీ ఫోన్‌లో గడిపే పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టండి. చరవాణికి అలవాటు పడితే సెలవుల అనంతరం పాఠశాలల సమయాల్లోనూ మనసు చదువుపై నిమగ్నం చేయలేరు.

పెద్దలను గౌరవించడం నేర్పుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానాన్ని అలవర్చాలి. సెలవుల్లో పిల్లలను బంధువుల ఇళ్లకు పంపిస్తుంటారు. పెద్దలను గౌరవించడం నేర్పించాలి. ఇందుకోసం రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. వారితో కలిసి భోజనం చేయడం, సరదాగా.. స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ ఉండాలి.

ప్రోత్సాహంతో.. ఉత్సాహం..




పిల్లలకు ఆసక్తి ఉన్న ఆట పాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు సెలవులు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం ఇతర అంశాలనే నేర్చుకునే దిశగా ప్రేరేపించి, ఫలితంగా వాటిపై పట్టు సాధించవచ్చు.

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా.. పెద్దా అంతా కలిసి ఉండేవారు. సెలవుల్లో అమ్మమ, నాయనమ్మ, బంధువుల ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదనుగా సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండుగల విశిష్టతను తెలియజేయాలి.

పుస్తకం వైపు మరలేలా..



మారుతున్న పరిస్థితుల్లో పిల్లలు పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. సెలవుల నేపథ్యంలో ప్రతి రోజు ఉదయం లేదా సాయంత్రం పిల్లలను ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న విజ్ఞాన భాండాగారాలకు తీసుకెళ్లాలి. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అక్కడ అందుబాటులో ఉంటాయనే విషయాన్ని తెలియజెప్పాలి. తద్వారా వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుంది.

ఒక్క ఊరోళ్లముయ్యాలో.. ఒకటేమేమంత ఉయ్యాలో..



బీబీనగర్ మండలం మహాదేవపురంలో ఒకే రకమైన చీరలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఒకే రకమైన చీరలు కట్టుకొని బతుకమ్మ ఆడుతున్న మహిళలు గ్రామాల్లో సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. బతుకమ్మ ఆటలో పేద, ధనిక అని భేదాభిప్రాయం లేకుండా ఉండేందుకు నూతన విధానం అమలు చేస్తున్నారు బీబీనగర్ మండల మహిళలు. గతంలో పట్టు వస్త్రాలు, నగలు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే వారు అలా పేద, ధనిక భేదం వస్తోందని భావించి మహిళలంతా ఒక్కటే అని చాటి చెప్పేందుకు బీబీనగర్ మండలంలోని మహాదేవపురం, కొండమడుగు, రహీంఖాన్‌గూడ, బీబీనగర్, వెంకిర్యాల గ్రామాల్లో పలువురు మహిళలు ఇలాంటి వేడుకకు వాట్సప్ గ్రూప్‌ల ద్వారా పిలుపునివ్వడంతో మిగతా మహిళలు కూడా అనుసరించారు. గ్రామాల్లో ఒక్క ఊరుల్లోముయ్యాలో.. ఒక్కటేమేమంత ఉయ్యాలో.. అంటూ పూల పండగను వైభవంగా జరుపుకొంటున్నారు. - న్యూస్‌టుడే, బీబీనగర్

ఎంజీయూ బీఈడీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం బీఈడీ ఫలితాలను శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవి, అదనపు కంట్రోలర్ డా.లక్ష్మీ ప్రభ విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్‌లో 92.6శాతం, మూడో సెమిస్టర్‌లో 79.30శాతం, రెండో సెమిస్టర్‌లో 84.96శాతం, మొదటి సెమిస్టర్‌లో 77.07శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

నల్గొండ సిగలో మరో కలికితురాయి

జిల్లా కేంద్రంలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణం ఏర్పాటుకు సన్నాహాలు

ఈనాడు, నల్గొండ : జిల్లా కేంద్రం నల్గొండ మరో ఉన్నత విద్యా సంస్థకు వేదిక కానుందా..? అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం అవుననే అంటోంది. బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయాన్ని (ఆర్‌జీయూకేటీ)కి అనుబంధంగా మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని భావిస్తున్న ప్రభుత్వం.. అందులో ఒకటి నల్గొండలో ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాంగణాలను ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో త్వరలోనే మాట్లాడనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విద్యాసంస్థల పరంగా మిగతా జిల్లాలతో పోలిస్తే కొంత వెనకబడ్డ నల్గొండ జిల్లాలో ట్రిపుల్ ఐటీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తే ఇక్కడి గ్రామీణ విద్యార్థులకు మేలు జరగనుంది. ప్రాంగణం ఏర్పాటుకు అవసరమైన భూమి ఎక్కడుందనే దానిపై ఆరా తీయాలని నల్గొండ, సూర్యాపేట జిల్లాల అధికారులను ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే మౌఖికంగా సూచించినట్లు సమాచారం. నల్గొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల చుట్టుపక్కల ప్రభుత్వ భూముల లభ్యత, అవసరాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. మరో వైపు ఎంజీ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రాంగణం ఏర్పాటు చేసి భూ సేకరణ అనంతరం పక్కా భవనాల నిర్మాణం చేయాలనే ఆలోచనను కొంత మంది అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే ట్రిపుల్ ఐటీ ప్రాంగణం ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయని.. వారం పది రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు.

మనస్తాపంతో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

శాలిగౌరారం, తిరుమలగిరి, న్యూస్‌టుడే: చేయని దొంగతనం నింద తనపై మోపి.. పోలీస్ స్టేషన్‌లో పెట్టి కొట్టించారని మనస్తాపం చెందిన టిప్పర్ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం శాలిగౌరారం మండలం ఆకారంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారానికి చెందిన టిప్పర్ డ్రైవర్ నాగరాజు తిరుమలగిరి మండలంలోని ఓ క్రషర్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మిల్లు యజమాని నాలుగు నెలలుగా తనకు జీతం ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని, జీతం డబ్బులు అడిగితే టిప్పర్ల డీజిల్ దొంగతనం చేశావని తనపై కేసు పెట్టాడని, దీంతో తిరుమలగిరి ఎస్సై కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని బాధితుడు నాగరాజు తన స్నేహితులకు సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా చెప్పాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నాగరాజు ఆకారంలో తన వ్యవసాయ బావి వద్ద తీసిన వీడియో ఆధారంగా అతని స్నేహితులు వెళ్లి చూసే సరికి ఉరి వేసుకొని అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం నల్గొండ ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు బంధువులు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి, మిల్లు యజమాని చెబితేనే ఎస్సై తీవ్రంగా కొట్టాడని నాగరాజు చెప్పారు. స్పందించిన స్థానిక ప్రజాప్రతినిధి సామాజిక మాధ్యమాల్లో మాట్లాడిన వెంకన్నకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ బలవన్మరణ యత్నం చేసుకునే విధంగా భయభ్రాంతులకు గురిచేసిన యజమానిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. డీజిల్ చోరీ జరగడంపై ఆరుగురిపై మిల్లు యజమాని ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేయగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్సై వి.సురేశ్ తెలిపారు. వారే మాట్లాడుకుంటామని వెళ్లారని, నేను ఎలాంటి చిత్రహింసలకు గురి చేయలేదని తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: పరిమితికి మించిన వేగంతో లారీ దూసుకు రావడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన కల్మెడతండా వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. మరో ఐదు నిమిషాల్లో తన ఇంటికి చేరాల్సిన వ్యక్తి అనంత దూరాలకు వెళ్లిపోయాడు. ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ దర్గా ఆవాస గ్రామం కల్మెడతండా నివాసి, రేషన్ డీలర్ ధరావత్ శివరాం నాయక్(68) ద్విచక్రవాహనంపై వ్యవసాయ పనుల నిమిత్తం దామరచర్లకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నాటకరంగంలో అనేక పాత్రల్లో రాణించి పలు అవార్డులు సాధించిన శివరాంనాయక్ మృతిపై పలువురు కళాకారులు, గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



శివరాం నాయక్

కారు బోల్తా.. భర్త మృతి

భార్యతోపాటు మనుమరాలికి గాయాలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కారు బోల్తా పడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం మండలంలోని అడివెంల స్టేజీ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామానికి చెందిన, సర్వాయి పాపన్న గౌడ్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేసు రాములు(49), అతని భార్య అంజమ్మ, మనుమరాలుతో కలిసి తుంగతుర్తిలో తన రెండో కుమార్తె ఇంట్లో శుభకార్యానికి వెళ్లి కారులో తిరుగు పయనమయ్యారు. అడివెంల స్టేజీ సమీపంలో కారు అదుపు తప్పి కల్వర్టు గోడను ఢీ కొట్టడంతో బోల్తాపడి నుజ్జునుజ్జయ్యింది. చుట్టుపక్కల వారు వచ్చి కారులోంచి రాములుతో భార్య, మనుమరాలును బయటికి తీశారు. అప్పటికే రాములు మృతి చెందారు. అతని భార్య, మనుమరాలుకు గాయాలు కావడంతో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు. వివాహం కాని చిన్న కుమార్తె ఇటీవలనే ఉన్నత చదువుల నిమిత్తం లండన్‌కు వెళ్లారు. ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.



రేసు రాములు

చెరువులోకి ఎప్పుడొస్తావ్.. చేపా..!



భానుపురి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేప పిల్లల విడుదలలో జాప్యం నెలకొంటోంది. అదను దాటుతుండటంతో చేప పిల్లల విడుదల ఉంటుందా లేదా అని మత్స్యకారుల్లో సందిగ్ధం నెలకొంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2,431 చెరువులను మత్స్యశాఖ అధికారులు ఎంపిక చేశారు. నిరంతరం నీళ్లుండే నీటి వనరుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా.. సెప్టెంబరు ముగిసినా ఒక్క చెరువులోనూ విడుదల చేయలేదు.

టెండర్లు ఆలస్యమే

జూన్, జులైలోనే టెండర్లు పూర్తి చేసి ఆగస్టు నాటికి చేప పిల్లలు వదలాల్సి ఉంది. ఉచిత చేప పిల్లల పంపిణీ అమలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఆలస్యంగా ఉత్తర్వులు రావడంతో జులై 10 నుంచి టెండర్లను ఆహ్వానించగా పెండింగ్ బిల్లులు చెల్లించని కారణంగా గుత్తేదారులు ముందుకురాలేదు. ఆగస్టు 2 వరకు పొడిగించినా స్పందన లేదు. ఆగస్టు 23 వరకు టెండర్ల గడువును పొడిగించడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12 మంది గుత్తేదారులు ముందుకొచ్చారు. నల్గొండలో ఐదుగురు, సూర్యాపేట నలుగురు, యాదాద్రి ముగ్గురు మాత్రమే టెండర్లలో పాల్గొన్నారు. వీరికి చెరువులు లేకపోవడం, చేపలు పెంచకపోవడంతో ఉన్నతాధికారులు పరిశీలన చేసి ఆ టెండర్లను రద్దు చేశారు. మళ్లీ కొత్తగా పిలిచారు. నేటికీ గుత్తేదారుల ఎంపిక చేపట్టలేదు.



గతేడాది విడుదల చేసేందుకు తీసుకొచ్చిన చేప పిల్లలు

ఉమ్మడి జిల్లా వివరాలు..


జిల్లా	మత్స్య సంఘాల సభ్యులు	గుర్తించిన చెరువులు	చేప పిల్లల లక్ష్యం (కోట్లల్లో..)
నల్గొండ	27,000	953	6
సూర్యాపేట	15,366	620	3.41
యాదాద్రి	10,000	658	2.71

ఉపాధికి దెబ్బ

చెరువుల్లో ఆలస్యంగా చేప పిల్లలు వదిలితే అవి ఎదిగే అవకాశం ఉండదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నల్గొండ 27,000, సూర్యాపేట 15,366, యాదాద్రి 10,000 సంఘం సభ్యులు ఉన్నారు. వీరంతా చేపల వేటపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఈసారి నేటికీ చెరువుల్లో మీనాలను విడుదల చేయకపోవడంతో వేసవిలో నీళ్లింకే సమయానికి చేపలు ఎదగక నష్టం జరిగే అవకాశం ఉంది.

క్షేత్ర పరిశీలన చేసి ఖరారు చేస్తాం

-నాగులు నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి, సూర్యాపేట



గుత్తేదారులు చేప పిల్లల పెంపకం చేపడితేనే టెండర్ అప్పగిస్తాం. ఇటీవల పెంపకం చేపట్టకుండా టెండర్‌లో పాల్గొన్న వారిని రద్దు చేశాం. మళ్లీ నలుగురు టెండర్లలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అప్పగించిన వెంటనే చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం.

పెంచుతున్నారు.. కూరగాయల సాగు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వినియోగదారులు ఇక్కట్లు పడుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లు సాగు విస్తీర్ణం లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. విత్తనాలు అందించే పథకం గత కొన్నేళ్లుగా నిలిచిపోయింది. విత్తనాల పంపిణీ స్థానంలో నారును ఉచితంగా అందించే పథకాన్ని అమలు చేస్తున్నారు.

ముందస్తు దరఖాస్తు తప్పనిసరి

ఉమ్మడి జిల్లాలో మిరప, టమాట, వంగ తోటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ఉచితంగా నారు అందించనున్నారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఎంతైనా నారు ఇవ్వడానికి ఉద్యాన శాఖ ముందుకు వచ్చింది. కావాల్సిన రైతులు నెల రోజుల ముందుగా సంబంధిత ఉద్యాన శాఖ అధికారికి దరఖాస్తు చేయాలి. ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నర్సరీలో టమాట, మిరప, వంగ నారు మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

అవగాహన లేక..

కూరగాయల సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నా.. ఉచితంగా అందించే నారుకు సంబంధించి ప్రచారం లేకపోయింది. దీంతో కూరగాయల సాగుపై ఆసక్తి చూపట్లేదు. నారును నర్సరీ నుంచి తెచ్చుకోవడానికి రవాణా ఖర్చులు కూడా ఉద్యాన శాఖ చెల్లిస్తోంది. కావాల్సిన రైతులు ముందస్తుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

సాయిబాబ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నల్గొండ

ఆసక్తి గల అన్నదాతలు ఉచితంగా అందించే మిరప, టమాట, వంగ నారును తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి. నారు కావాల్సిన రైతులు 20 నుంచి నెల రోజుల ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలి. నాణ్యమైన నారు అందిస్తాం.



మిరప నారు

మూసీ ప్రక్షాళన సమావేశానికి తరలిరండి



మోత్కూరులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, పుర అధ్యక్షురాలు

మోత్కూరు, న్యూస్‌టుడే: లక్షల ఎకరాలకు సాగు నీరందించే మూసీనది ప్రక్షాళన కోసం శనివారం హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు మూసీ పరివాహక ప్రాంత రైతులు, ప్రజలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. ఈ సమావేశానికి మూసీ పరివాహక ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మోత్కూరు పుర కార్యాలయంలో పుర అధ్యక్షురాలు గుర్రం కవిత, కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళనకు నడుం బిగిస్తే.. నాటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, భాజపా నాయకులు గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. బునాదిగానికాల్వకు త్వరలోనే టెండర్లు పిలుస్తున్నారని తెలిపారు. మంత్రితో చెప్పి గంధమల్ల ప్రాజెక్టు నుంచి మోత్కూరు బిక్కేరులోకి నీరు విడుదల చేయించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షుడు బి.వెంకటయ్య, ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్, సింగిల్‌విండో ఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఊరికి దూరంగా.. వృథాగా..



ఊరికి దూరంగా నిర్మించడంతో మూడేళ్లుగా వైకుంఠధామం ఉపయోగంలోకి రాకుండా పోయింది. మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో ఉపాధిహామీ పథకం 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.12 లక్షలు నిధులతో ఈ వైకుంఠధామాన్ని సూరారం వెళ్లే దారిలో నిర్మించారు. బోరు వేసినప్పటికీ కరెంటు సౌకర్యం కల్పించకపోవడంతో నీళ్లు అందుబాటులో లేవన్న కారణం, ఊరికి దూరంగా ఉందని స్థానికులు ఈ వైకుంఠధామం వైపు కూడా చూడటం లేదు. దీంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయని విమర్శిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నర్సయ్యను వివరణ కోరగా.. ఊరికి దూరంగా ఉన్న కారణం, కరెంటు సౌకర్యం కూడా లేకపోవడంతో స్థానికులు ఉపయోగించుకోవడం లేదని తెలిపారు.

– మోత్కూరు, న్యూస్‌టుడే:

ప్రభుత్వ స్థలానికి పట్టా నెంబరుతో రిజిస్ట్రేషన్

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ 13వ వార్డులో 162 సర్వే నెంబరులో పేదలకు పట్టాలిచ్చిన స్థలాన్ని ఆక్రమించి పట్టా నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించి, ఇళ్లు నిర్మించి అమ్ముతున్నారని పురపాలిక పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సీడీఎంఏ)కు కాలనీవాసులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి పక్కనున్న పట్టా నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రుణాన్ని పొంది ఇళ్లు నిర్మాణం చేసి అమ్మడానికి ప్రయత్నించారని ఆ ఫిర్యాదులో ఉదహరించారు. ఈ ఇళ్లను, స్థలాలను కొనుగోలు చేసేవారు మోసపోగూడదని కాలనీవాసులు ఏర్పాటు చేసిన బోర్డును ఆక్రమణదారులు విరగ్గొట్టారని జిల్లా కలెక్టర్, ఏసీపీలకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని ఆ పార్టీ నాయకుడు జక్కిలి అయిలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని జనగాం గ్రామంలో గడ్డం రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కరంటోతు శ్రీను, బాలకృష్ణ, భిక్షపతినాయక్, నర్సింహ, సతీష్, మాధవరెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

అడిగిన వారికి పని కల్పించాలి

రాజపేట, న్యూస్‌టుడే: ప్రతి కూలీకి స్థానికంగా ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అదనపు అధికారి సురేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్షేత్రసహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారదర్శకంగా పనుల నిర్వహణ చేపట్టాలని, నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. త్వరలో సామాజిక తనిఖీ కార్యక్రమం ఉండనున్నందున అప్రమత్తంగా నిర్వహణ కొనసాగించాలన్నారు. సమావేశంలో ఎంపీవో కిషన్, ఇన్‌ఛార్జి ఏపీవో కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

గుండాల, న్యూస్‌టుడే: గోదావరి జలాలు బిక్కేరు వాగులోకి వచ్చిన సందర్భంగా మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. కరవు ప్రాంతమైన గుండాల మండలానికి గోదావరి జలాలు తీసుకురావడానికి కృషి చేసిన మంత్రి కోమటిరెడ్డికి, ఎమ్మెల్యే బీర్లకు కృతజ్ఞత తెలిపారు.

రైతులను మోసం చేస్తే సహించం

మోత్కూరు, న్యూస్‌టుడే: రైతులు తెచ్చే ధాన్యాన్ని వేబ్రిడ్జీలపై తూకం వేయడంలో మోసం చేస్తే సహించేది లేదని జిల్లా తూనికల, కొలతల శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం మోత్కూరు పురపాలిక పరిధి గుండాల రోడ్డులో గల పెట్రోల్‌బంక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ కొలతలు, మీటర్ రీడింగ్‌లను పరిశీలించారు.

మర్రి విజయలక్ష్మికి డాక్టరేట్

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరుకు చెందిన మర్రి విజయలక్ష్మికి ఉస్మానియా యూనివర్సిటీలో శుక్రవారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎ.కృష్ణశైలజ నేతృత్వంలో 'ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ గ్యాస్ట్రో రిటెన్టివ్ ఫ్లోటింగ్ మైక్రో స్ఫియర్స్ ఆఫ్ యాంటీ హైపర్ టెన్సివ్ డ్రగ్స్' అన్న అంశంపై చేసిన పరిశోధనకు ఈ గౌరవ డాక్టరేట్ లభించిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం విజయలక్ష్మి సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

మద్యం మత్తులో భార్యకు ఉరివేసి..

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో భర్త తన భార్య మెడకు చీరతో ఉరివేసి హత్యచేసిన సంఘటన అడ్డగూడూరు మండలం డి.రేపాకలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై డి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొనుగ స్వరూప (50) భర్త కృష్ణారెడ్డి మద్యానికి బానిస కావడంతో తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల పత్తి అమ్మగా వచ్చిన డబ్బులు స్వరూప తన దగ్గర దాచిపెట్టుకోవడంతో భర్త గొడవకు దిగాడు. కొన్ని డబ్బులు తీసుకొని వెళ్లి మద్యం తాగి వచ్చాడు. స్వరూప మొదటి అంతస్తులో నిద్రిస్తుండగా చీరతో ఆమె మెడకు కృష్ణారెడ్డి ఉరి వేసి హత్య చేశాడు. చీరతో తన భార్య ఉరిపెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడిందంటూ చిత్రీకరించబోయాడు. చుట్టుపక్కల వారు వచ్చి చూడగా, భర్త ప్రవర్తనపై అనుమానం రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు భర్తను నిలదీయడంతో జరిగిన విషయం చెప్పాడు. భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు మృతదేహానికి పంచనామా నిర్వహించి మరణోత్తర పరీక్ష నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతురాలికి ఒక్కతే కుమార్తె సంతానం.



బొనుగ స్వరూప

గిరిప్రదక్షిణలో పాల్గొనండి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం జరిగే యాదాద్రి గిరి ప్రదక్షిణలో భక్తులు, స్థానికులు పాల్గొనాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మానసిక ప్రశాంతతకు భక్తి మార్గం సరైందని, క్షేత్ర వైభవం మరింత వెలుగొందడానికి తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కానుగు బాలరాజు, గుండ్లపల్లి భరత్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు: డ్రైవర్ మృతి



చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఎల్లగిరి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన మిట్టపల్లి నర్సింహ(46)కు ఆటో కలదు. చిట్యాలకు చెందిన బారాల లక్ష్మమ్మ పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఆమె పండ్లను కొనుగోలు చేసేందుకు రంగారెడ్డి జిల్లా కొత్తగూడెంలోని పండ్ల మార్కెట్‌కు నర్సింహ ఆటోలో బయలుదేరింది. ఎల్లగిరి క్రాస్‌రోడ్డులోని సంగెం హోటల్ వద్దకు చేరుకోగానే ఆటోను వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతదేహానికి చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై కృష్ణమల్ సూర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

మురుగుకాల్వలో పడి వ్యక్తి..

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: మూత్రవిసర్జనకు వెళ్లిన వ్యక్తి మురుగుకాల్వలో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భువనగిరి పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన గడ్డమీద శ్రీనివాస్(36) డ్రైవర్‌గా పని చేసేవాడు. నల్గొండ చౌరస్తాలో సమీపంలో దుర్గామాత మండపం వద్దకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి గురువారం రాత్రి వెళ్లాడు. మద్యం మత్తులో మురుగుకాల్వ వద్ద మూత్రవిసర్జన చేస్తూ అందులో పడిపోయాడు. స్థానికులు శుక్రవారం గమనించి సమాచారం అందించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పంచనామా నిర్వహించిన మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రి మార్చురీకి తరలించారు. శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

అవీ ఇవీ

ఆర్థిక సాయం.. సంస్థాన్ నారాయణపురం: మండలంలోని వెంకంబావితండాకు చెందిన కరంటోతు హస్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందింది. తండాకు చెందిన యువకులు రూ.10 వేలను శుక్రవారం మృతురాలి కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. కరంటోతు బాషా, రవి పాల్గొన్నారు.

భారాస సీనియర్ నాయకుడి మృతి.. సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రానికి చెందిన భారాస సీనియర్ నాయకుడు కొప్పు సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఉప్పల లింగస్వామి, బాలకృష్ణ, నర్సింహ, దోనూరు జైపాల్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సామాజిక తనిఖీ.. తుర్కపల్లి: మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ఉన్నందున ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది హాజరు కావాలని ఆమె శుక్రవారం పేర్కొన్నారు.

ప్రవాస భారతీయుని చేయూత.. చౌటుప్పల్‌గ్రామీణం: మండలంలోని దామెర గ్రామానికి చెందిన ఊడుగు ధనలక్ష్మి భర్త కృష్ణ కరోనా సమయంలో చనిపోయారు. దీంతో ధనలక్ష్మికి కుటుంబ పోషణ, కుమార్తె చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న ప్రవాస భారతీయుడు మండల విశ్వానాథం ఆమెకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని పంపించగా.. వలికి దిలీప్, వినోద్, విశ్వచందర్, ముఖేష్, గిరి, సాతిరి రాజు, ఆకాశ్‌లు అందజేశారు.

6న విజయదశమి ఉత్సవం

భువనగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో ఈ నెల 6న పట్టణంలో విజయదశమి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ పట్టణ కార్యవాహ ఎమికె శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సేవా భారతి సంస్థ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ఉసులుమర్తి వాసు వక్తగా, పట్టణానికి చెందిన వైద్యుడు హేరాకార్ శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

చెరువు కట్టపై నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

మోత్కూరు, న్యూస్‌టుడే: జారి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మోత్కూరు మండలం అనాజిపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మోత్కూరు పురపాలిక పరిధి కొండాపురం గ్రామానికి చెందిన మన్నె వెంకటయ్య(55) ద్విచక్ర వాహనంపై పొడిచేడు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా అనాజిపురం చెరువు కట్టపైన మలుపు వద్ద జారి కింద పడ్డారు. తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై నాగరాజు తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వీఆర్ఏల వినతి



భువనగిరి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

మోత్కూరు, న్యూస్‌టుడే: గత సర్కారు అనాలోచిత నిర్ణయాల వల్ల తాము రోడ్డున పడ్డామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ 55 నుంచి 61 సంవత్సరాల వయస్సు గల వీఆర్ఏలు శుక్రవారం భువనగిరి ఆర్డీవో అమరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో 81, 85, 98పై పదోన్నతి పొంది 55 నుంచి 61 వయస్సు మధ్యగల వీఆర్ఏల దళిత కుటుంబాలు రాష్ట్రంలో 2,500లకు పైగా రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రయోజనాలు పొందకుండానే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని, కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో మోత్కూరు ప్రాంత వీఆర్ఏలు బి.సాయిలు, వెంకటేష్, ఊషయ్య, వెంకటయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

కమిటీల పేరుతో కాలయాపన :ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న దుబ్బ రామకృష్ణ

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడంతో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామిమాదిగ అన్నారు. భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. డీఎస్సీ నియామక పత్రాలు పంపిణీ రోజు జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకుడు మంద శంకర్‌మాదిగ, నాయకులు దుబ్బ దానయ్య, ఇటుకాల దేవేందర్, బోయి లింగస్వామి, నల్ల స్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో బతుకమ్మ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బతుకమ్మ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. కేంద్రంలోనే చిన్నారుల తల్లులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చారు. హిందూ ముస్లిం బేధం లేకుండా అంగన్‌వాడీ టీచర్ ఎండి సఫియా, పిల్లలు, తల్లులు వారు సిద్ధం చేసిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

బతుకమ్మ సంబురాలకు తరలివెళ్లాలి

భువనగిరి, న్యూస్‌టుడే: హైదరాబాద్ నాంపల్లిలోని టీజీవో కార్యాలయంలో ఈ నెల 8న జరగనున్న బతుకమ్మ సంబురాలకు పెద్ద ఎత్తున గెజిటెడ్ అధికారులు జిల్లా నుంచి తరలి వెళ్లాలని టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.జగన్మోహన ప్రసాద్ కోరారు.



భువనగిరిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

కార్యక్రమానికి చెందిన గోడపత్రికను టీజీవోలతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ చంద్రారెడ్డి, చైతన్య, శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, ఏఎస్‌వో రోజా, మహిళా నాయకురాళ్లు బండి రాణి, ప్రియాంక, స్వాతి, మంజుల, హారిక, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ధ్రువీకరణ పత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే ఆదేశించారు. వెన్నెల కళాశాలలో ఇటీవల డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఆయన శుక్రవారం సందర్శించారు. జిల్లాలో మొత్తం 629 మంది అర్హత సాధించగా ఇందులో ఇప్పటి వరకు 473మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.



వెన్నెల కళాశాలలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రసన్న రత్నాకర్ సేవలు చిరస్మరణీయం

రామన్నపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి కోసం దివంగత జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతులు వేమవరం ప్రసన్న, రత్నాకర్‌బాబురావు చేసిన కృషి చిరస్మరణీయమని పలు పార్టీల నాయకులు పేర్కొన్నారు. ప్రసన్న, రత్నాకర్‌బాబురావు వర్ధంతిని జనంపల్లిలో శుక్రవారం నిర్వహించారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వేమవరం సుధీర్‌బాబు, సంగిశెట్టి సుదర్శన్, పోచబోయిన మల్లేశం, నక్క యాదయ్య, చల్లమల్ల లింగారెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

సమాచారం పక్కాగా సేకరించాలి



సర్వే నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్, కమిషనర్ రామాంజుల రెడ్డి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న డిజిటల్ కార్డు పంపిణీ నేపథ్యంలో సర్వేను పక్కాగా, పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హన్మంత్ కె.జండగే సర్వే బృందాలకు సూచించారు. యాదగిరిగుట్టలోని 8వ వార్డులో నిర్వహించిన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట పుర కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు దేశ్యనాయక్, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశ్ తదితరులున్నారు.

భువనగిరి పట్టణం: డిజిటల్ కార్డుల రూపకల్పన కోసం కుటుంబాల నుంచి పక్కా సమాచారం సేకరించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో కొనసాగుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. కమిషనర్ రామాంజుల రెడ్డి, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలం మహదేవపూర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్‌రావు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించారు. అక్కన్న మాదన్న ఆలయంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉమామహేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో దండెం ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మాజిద్, దేవాలయ ఈవో రుద్ర వెంకటేశం పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: జిల్లాలో భువనగిరి, ఆలేరు, రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జిలు నాగేశ్వరరావు, సుమలత, ప్రదీప్, చందన సీనియర్ సివిల్‌జడ్జిగా పదోన్నతి పొందారు. సీనియర్ సివిల్ జడ్జిగా పదన్నోతి ఇస్తూ బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగేశ్వర్‌రావు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, సుమలత కామారెడ్డికి, ప్రదీప్ వరంగల్‌కు, చందనను హన్మకొండ సీనియర్ సివిల్ జడ్జిలుగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్‌జడ్జిగా, ఇన్‌ఛార్జి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా ఉన్న వి.మాధవిలతకు పూర్తిస్థాయి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. రంగారెడ్డి కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జిగా ఉన్న ఎం.ఉషాశ్రీ పదోన్నతిపై పొంది భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా, సూర్యాపేట జిల్లా కోదాడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యామ్‌సుందర్ భువనగిరిలోని అదనపు సీనియర్ సివిల్‌జడ్జిగా రానున్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు



స్వర్ణగిరి: ధనలక్ష్మీ స్వరూపిణిగా పద్మావతి అమ్మవారు



చౌటుప్పల్ మార్కండేయ ఆలయంలో..

జిల్లా వ్యాప్తంగా శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామిస్వామి ఆలయంలో శుక్రవారం పద్మావతి అమ్మవారిని ధనలక్ష్మీ స్వరూపంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చౌటుప్పల్‌లో ఆర్యవైశ్య సంఘం, మార్కండేయ, శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీబాలాజీ రామకృష్ణ దేవాలయాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. యాదాద్రి క్షేత్రంలో అనుబంధ శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీగాయత్రీదేవి అలంకరణతో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీబీనగర్ మండలం జైనపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పింగళి రెడ్డి శుక్రవారం సందర్శించారు. బొమ్మల రామారంలో ఏర్పాటు చేసిన దుర్గమాత వద్ద ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలో, వలిగొండలో గాయత్రిదేవి రూపంలో దర్శనమించారు. మోత్కూరు పాత పోస్టాఫీసు బజారులో విశ్వకర్మలు ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆ బజారులోని విశ్వకర్మలు పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం



యాదాద్రి: గాయత్రీదేవి అలంకరణలో



యాదగిరిగుట్ట-ప్రశాంత్‌నగర్‌లో..



మోత్కూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న విశ్వకర్మలు

నర్సింగ్ విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ



బీబీనగర్ ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ ఇస్తున్న ఆర్మీ సిబ్బంది

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థినులకు శుక్రవారం ఆత్మరక్షణలో శిక్షణ కల్పించారు. సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్‌కు చెందిన ఎన్‌బీ సుబేదార్ గౌతమ్‌సింగ్ నేతృత్వంలో శిక్షణ కల్పించారు. ఆత్మరక్షణ కేవలం సాంకేతికపరమైన అంశాలకు సంబంధించినది కాదని, తమను తాము ఆపద నుంచి రక్షించుకోగలమని మనసులో దృఢంగా సంకల్పించుకోవాలన్నారు. ఇటీవల ఎయిమ్స్‌లో నర్సింగ్ విద్యార్థినుల కోసం నిర్వహించిన ఫౌండేషన్ కోర్సులో భాగంగా ఆత్మరక్షణలో శిక్షణ కల్పించాలని వికాస్‌భాటియా తెలిపారు. అకాడమిక్స్ డీన్ డాక్టర్ రాహుల్‌నారంగ్, డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) డాక్టర్ బిపిన్ వర్గీస్, డాక్టర్ సిద్ధార్థ్, డాక్టర్ సుభద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని యాదగిరిగుట్ట: మహేశ్వర్‌రెడ్డి

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదిగిరిగుట్టలో అభివృద్ధి కుంటుపడిందని, పట్టణ ప్రజలకు కావల్సిన మౌలిక సౌర్యాలు కల్పన పూర్తిగా శూన్యమని భాజపా శాసన సభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. భువనగిరి మండలం చందుపట్లలో నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో కలిసి ఆయన యాదగిరిగుట్ట మండలం మైలార్‌గూడెం గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కొండ కింద ఇంకా ఎన్నో సౌకర్యాల కల్పనపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

భువనగిరి: చందుపట్ల దీక్షకు వెళ్తూ భువనగిరిలో ఆగిన భాజపా శాసనసభ పక్షా నేత ఎ.మహేశ్వర్‌రెడ్డికి భాజపా నాయకులు స్థానిక రహదారి బంగ్లాలో ఘన స్వాగతం పలికారు.